క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజంపేట రూరల్ : బ్రహ్మణపల్లి సబ్ స్టేషన్ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ తెలియజేశారు. స్థానిక డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజంపేట మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి సబ్ స్టేషన్ 220 కెవిఎస్ఎస్ పరిధిలో గురువారం విద్యుత్ లైన్ల నవసీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలియజేశారు. రాజంపేట పట్టణంతో పాటు మండలంలోని తాళ్లపాక, ఆకేపాడు, కట్టకిందపల్లి, ఎస్ఆర్ పాళెం, హెచ్ చెర్లోపల్లి సబ్ స్టేషన్‌ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలియజేశారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : నేడు గురువారం బ్రాహ్మణపల్లి సబ్‌స్టేషన్ 220 కేవీ లైన్ మారుస్తున్న కారణంగా విద్యుత్ అంతరాయం కలుగనుంది. దీంతో పుల్లంపేట మండలంలోని రెడ్డిపల్లి, బావికాడపల్లి, వత్తలూరు, పుత్తనవారిపల్లి, దళవాయిపల్లి, కొండ్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి గ్రామాలకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ తెలిపారు. ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

నివాళి



వీరారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రామాపురం : మండలంలోని రాచపల్లి గ్రామం మాజీ సర్పంచ్ గాలివీటి వీరారెడ్డి దశదిన కర్మకాండ కార్యక్రమానికి బుధవారం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి హాజరై వీరారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి, వెంకట్రామిరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్తకోడూరు జాతర



అలంకారంలో కొత్తకోడూరు గంగమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్తకోడూరులో వెలసివున్న గంగమ్మకు బుధవారం ఘనంగా జాతర నిర్వహించారు. వేకువజామున గంగమ్మ మిట్ట నుంచి గంగమ్మను ఊరేగింపుగా తీసుకుని వచ్చి ఆలయం వద్ద ప్రతిష్టించారు. అనంతరం భక్తులు పెద్దఎత్తున మొక్కుబడులు తీర్చుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే నిర్వాహకులు భక్తులకు అన్నదానాలు, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

'అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రజలు ఇచ్చిన విజయాన్ని మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి సద్వినియోగం చేసుకొని ప్రజలకు గొప్పగా సేవ చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గాజుల భాస్కర్ కోరారు. మొదటి సారిగా గెలవడంతోపాటు మంత్రి పదవి దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. రాయచోటి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని సూచించారు. రాయచోటి ప్రాంతం బాగా వెనుకబాటుకు గురైన ప్రాంతమన్నారు. ఇప్పటికైనా చొరవ చూపి ప్రాంతం అభివృద్ధిపై శ్రద్ధ చూపాలని తెలియజేశారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

పెద్దమండ్యం: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఫోర్డ్ సంస్థ మండల కో ఆర్డినేటర్ ఆవుల నరసింహులు అన్నారు. మండలంలోని పాపేపల్లె పంచాయతీ గురివిరెడ్డిగారిపల్లెలో బుధవారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై కళాజాత నిర్వహించారు. బెంగళూరు క్రై సంస్థ సహకారంతో ఫోర్డ్ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులుగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురివిరెడ్డిగారిపల్లె పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిల్లలకు డ్రాయింగ్, ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మిదేవి, ఫోర్డ్ సంస్థ సిబ్బంది భువనేశ్వరి, అనిత, రెడ్డెమ్మ, మీనా, రమణ పాల్గొన్నారు.

అన్నదానం

మదనపల్లె సిటీ: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని మార్కెట్‌యార్డులో బుధవారం హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. విజయభాస్కర్‌నాయుడు పుట్టినరోజు పురస్కరించుకుని అన్నదానం చేసినట్లు హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూ బకర్ సిద్దిక్ తెలిపారు.

ఉద్యోగాల్లో ప్రతిభను కనబరచాలి

- ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా
- వివిధ కంపెనీలకు ఎంపికైన 172 మంది నిరుద్యోగులు
- ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్న అధికారులు



జాబ్ మేళాలో పాల్గొన్న ఐటీఐ విద్యార్థులు, నిరుద్యోగులు

రాజంపేట టౌన్ : చదువుకున్న వ్యక్తి జీవితంలో స్థిరపడాలంటే ఉద్యోగం అన్నది తప్పనిసరి అని, అందువల్ల తొలిసారిగా వచ్చే ఉద్యోగ అవకాశాలను వదులుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన నిరుద్యోగులనుద్దేశించి మాట్లాడారు. కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించేందుకే అనేక మంది విద్యార్థులు ఐటీఐ కోర్సు చేస్తారని అన్నారు. అందువల్ల ఐటీఐ పూర్తయిన వారు జాబ్‌మేళా ద్వారా ఉద్యోగం వస్తే ఆ అవకాశాన్ని చేజార్చుకోవద్దని సూచించారు. గతంలో ఐటీఐ ఉత్తీర్ణులైన వారు ఉద్యోగ అవకాశాల కోసం పెద్ద నగరాలకు వెళ్లి ఉద్యోగాన్వేషణ చేసేవారన్నారు. అయితే ఇప్పుడు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చిన్నపట్టణాలకు వస్తున్నారని చెప్పారు. నిజంగా ఇది ఇప్పటి నిరుద్యోగులు చేసుకున్న అదృష్టం అని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని, ఉద్యోగం వచ్చిన వారు మరో ఆలోచన చేయకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాదాపు అన్ని కంపెనీలు మెరుగైన వేతనం ఇవ్వడంతోపాటు కంపెనీకి వెళ్లి వచ్చేందుకు ఉచిత రవాణా సౌకర్యం, కంపెనీలో తక్కువ ధరకే భోజనం వంటి సౌకర్యాలను కల్పిస్తున్నాయన్నారు. అందువల్ల వచ్చే వేతనంలో కొంతవరకే ఖర్చవుతుందని, మిగతా డబ్బులను ఇంటి వద్ద ఉండే తల్లిదండ్రులకు వారి అవసరాల నిమిత్తం పంపుకోవడం కాని లేకుంటే పొదుపు చేసుకునేందుకు వీలవుతుందని తెలియజేశారు. ఇటీవలే ఐటీఐ పూర్తి చేసుకున్న వారికి తక్కువ వయస్సు ఉంటుందని, కొన్ని సంవత్సరాలు కష్టపడి ఉద్యోగం చేసి పనిలో ప్రతిభను కనబరిస్తే వేతనం కూడా భారీగా పెరుగుతుందన్నారు. అప్పుడు వివాహం చేసుకొని జీవితంలోనూ స్థిరపడి చక్కటి భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని తెలిపారు. ఇలాంటి విషయాలన్నింటిని పరిగణలోకి తీసుకొని వచ్చిన అవకాశాలను ఎవరు కూడా నిర్లక్ష్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు ఆయా కంపెనీల ప్రతినిధులు తమ కంపెనీల్లో ఉద్యోగం పొందిన వారికి ఇచ్చే వేతనం, కల్పించే సౌకర్యాలు, నియమ నిబంధనలను వివరించారు. కాగా ఈ జాబ్‌మేళాలో 190 మంది నిరుద్యోగులు పాల్గొనగా 172 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆయా కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగుల సర్టిఫికెట్లను పరిశీలించి అనంతరం రాత పరీక్షతోపాటు మౌఖికంగా ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టాటా స్త్రైవ్ సీనియర్ ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ మేనేజర్ మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న కంపెనీల ప్రతినిధులు

పక్కా ప్రణాళికతోనే అధిక దిగుబడి



మండలంలో జీలుగ పంటను సాగు చేసిన రైతులు

- జూన్ మొదటి వారం నుంచే ప్రారంభమైన ఖరీఫ్ సీజన్
- నేలను బట్టి పంట మార్పిడి చేయాలంటున్న అధికారులు

సిద్దవటం : ప్రణాళికతో పంట సాగు చేస్తే పంటలు పండి అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు. జూన్ మొదటి వారం నుంచే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 11 హెక్టార్లలో వరి పంట సాగయ్యే అవకాశం ఉంది. కాగా రైతులకు పచ్చిరొట్ట ఎరువుల కోసం సిద్దవటం మండలానికి ప్రభుత్వం నుంచి సకాలంలో జీలుగలు 234 క్వింటాళ్లు, జనుములు 10 క్వింటాళ్లు మంజూరు కావడంతో వాటిని ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాలలో రైతులకు పంపిణీ చేశారు. జనుము, జీలుగలు విత్తనాలను చల్లుకొని వరి పంట సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు.

భూసారాన్ని బట్టి పంట వేసుకోవాలి

ఖరీఫ్‌కు ముందే ప్రతి రైతు తమ చేనులో భూసార పరీక్షలు చేయించుకుంటే బాగుంటుందని అధికారులు పేర్కొంటున్నారు. భూసారాన్ని బట్టి అనుకూలమైన పంటలు మాత్రమే వేసుకోవాలని సూచిస్తున్నారు. దీని వల్ల రైతులకు పెట్టుబడులు తగ్గి దిగుబడి పెరుగుతుందని చెప్పారు. భూసారానికి అనుగుణంగా ఎరువులు, యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని తెలియజేశారు.

సేంద్రియ ఎరువులు మంచిది



ప్రతి రైతు సేంద్రియ ఎరువులను వాడటం అలవాటు చేసుకోవాలి. ఎక్కువగా రసాయన ఎరువులు వాడకం వల్ల పంటల దిగుబడిలో పలు సమస్యలు ఎదురవుతాయి. పశువుల ఎరువులు, వర్మీ కంపోస్టు ఎరువుల ద్వారా భూసారం పెరగడంతో పాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు.

– కె. రమేష్‌రెడ్డి, ఏఓ, సిద్దవటం మండలం

యాత్రికులపై ఉగ్రవాదుల చర్య అమానుషం



డీఆర్వోకు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ప్రతినిధులు

కడప కల్చరల్: జమ్ము కశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయం నుంచి శివ్‌ఖోడికి వెళ్తున్న హిందూ భక్తుల బస్సుపై ఇస్లామిక్ జిహాదీ ఉగ్రవాదుల దాడి అమానుషమని వీహెచ్‌పీ ప్రాంత ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ బెస్తవేముల రామ మహేష్, జిల్లా సహ కార్యదర్శి చిక్కన్న అన్నారు. ఉగ్ర దాడిలో పది మంది ప్రాణాలు కోల్పోయినందున, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఆర్వోకు వారు వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ ఆర్టికల్ 370ని తొలగించాక ప్రశాంత వాతావరణం ఏర్పడిందని, ఉగ్రవాదుల దుడుకు చర్యలు మాత్రం తగ్గలేదన్నారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసే సమయంలో ఈ సంఘటన దేశ సార్వభౌమాధికారానికి సవాలుగా నిలుస్తోందన్నారు. ఇలాంటి అంశాలను ప్రోత్సహించే అంతర్గత విదేశీ సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి మనోహర్‌రెడ్డి, సహ కార్యదర్శి సురేంద్ర, భజరంగ్‌దళ్ సహ సంయోజక్ అమర్, హిందూ పరిరక్షణ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానపీఠానికి గౌరవం తెచ్చిన కవి సినారె



సినారె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

కడప కల్చరల్: దేశ సాహిత్య రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠం పురస్కారానికి ప్రముఖ కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి గౌరవం తెచ్చారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో డాక్టర్ సి.నారాయణరెడ్డి వర్ధంతి బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులతో కలిసి డాక్టర్ సి.నారాయణ రెడ్డి చిత్రపటానికి పూల మాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణరెడ్డి విశ్వంభరం కావ్య రచనతో జ్ఞానపీఠ పురస్కారం పొందడమేగాక, తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించారన్నారు. కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ తెలుగు సినీ పాటల రచయితగా ఆచార్య నారాయణరెడ్డికి గొప్ప పేరుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతకుంట శివారెడ్డి, రమేష్‌రావు, ఆర్.వెంకటరమణ, సి.నీలకంఠేశ్వర్, హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి మహాభారత గ్రంథాలు



మహాభారత గ్రంథాలు అందజేస్తున్న సుధారాణి

కడప కల్చరల్ : పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల సుధారాణి బుధ వారం స్థానిక యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి మహాభారత గ్రంథాలను అందజేశారు. తన భర్త రిటైర్డ్ జిల్లా జడ్జి బొక్కసం వెంకటరమణ స్మారకంగా తితిదే ప్రచురించిన ఆంధ్ర మహా భారతం 18 పర్వాలను బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డికి ఆమె అందజేశారు. రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచుతామన్నారు. వైవీయూ వీసీ ఆచార్య చింతాసుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య పుస్తక దాతలను అభినందించారు.

వైభవంగా ఎదురుకోళ్ల ఉత్సవం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్య మఠం, కొండావధూత ఆశ్రమంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం జరగనున్న కల్యాణం సందర్భంగా బుధవారం రాత్రి ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల ఎదురుకోళ్ల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు పెళ్లిపెద్దలుగా ఉండి ఎదురుకోల్లు తంతును శాస్త్రోక్తంగా జరిపించారు. ఉదయం ఆలయంలో చతుస్థానార్చన, మూలమూర్తిహోమం, ఉత్సవబలి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే స్వామివారికి పవిత్రజలాలతో గంగానయనం కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డివెంకటరామిరెడ్డి, దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణం : వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించి సాయంత్రం హనుమంత వాహనసేవ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు.

చెలరేగిన మంటలు



పెట్రోలు బంకు సమీపంలో చెలరేగిన మంటలు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని హెచ్‌పీ పెట్రోలు బంకు ఆవరణలో బుధవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. అయితే సిబ్బంది వేగంగా స్పందించి మంటలను ఆర్పి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే ఇటీవల కురిసిన వర్షాలకు పెట్రోలు బంకులోని ట్యాంకర్లలోకి నీరు చేరడంతో పెట్రోలులో నీరు కలిసింది. వాహనాలకు పెట్రోలు పట్టే సమయంలో నీరు కూడా వస్తుండటంతో వాహనదారుల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో బుధవారం మరమ్మతులు చేపట్టే పనిలో భాగంగా ట్యాంకర్లలోకి దిగిన నీటిని హ్యాండ్‌బోర్ ద్వారా తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. అలా తొలగించిన నీటిని పెట్రోలు బంకు పరిసరాల్లోని డ్రైనేజీ కాలువలో పారబోశారు. ఈ సమయంలో నీటితో పాటు కొంత మేర పెట్రోలు కూడా వచ్చింది. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గ్రహించక సిగరెట్ వేయడంతో వెంటనే మంటలు చెలరేగాయి. మంటలు క్రమేపీ పెట్రోలు బంకులోకి వ్యాపించడం ప్రారంభించాయి. అప్రమత్తమైన పెట్రోలు బంకు సిబ్బంది బంకులోని సీఓటూ యంత్రాలతో మంటలను అదుపు చేశారు. మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల ఉన్న దుకాణదారులు పరుగులు తీశారు.

16న సిద్దవటంలో బండలాగుడు పోటీలు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్ హరిజనవాడలో కొలువైన జగజ్జనని అంకాలమ్మ తిరునాల సందర్భంగా ఈ నెల 16న వృషభ రాజములచే బండలాగుడు పోటీలు జరుగునని ఆలయ కమిటీ వారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 16వ తేదీన అంకాలమ్మ అమ్మవారి జల్ది నుంచి ఊరేగింపు కార్యక్రమం, భక్తులు అమ్మవారికి కాయాకర్పూరాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుట, మధ్యాహ్నం 2 గంటలకు వృషభ రాజములచే బండలాగుడు పోటీలు జరుగునన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిని రూ. 70వేలు మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్‌రెడ్డి, మేడా మధుసూధన్‌రెడ్డిలు ప్రకటించారు. రెండవ బహుమతి రూ. 50 వేలును మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, మజీ సర్పంచ్ మేకపాటి సుబ్బారెడ్డిలు అందజేయనున్నారు. మూడవ బహుమతి రూ. 30 వేలును సిద్దవటం జెడ్పీటీసీ సభ్యుడు ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి ఇవ్వనున్నారు. నాల్గవ బహుమతి రూ. 10వేలును ఎస్‌కేఆర్ నగర్ గ్రామ ప్రజలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా మారెమ్మ తల్లి జాతర



ప్రత్యేక అలంకరణలో మారెమ్మ



జాతరలో భక్తులను ఆకట్టుకున్న చాందినీబండ్లు

సంబేపల్లె : మండల పరిధిలోని పెద్దబిడికి పంచయతీలో కొలువైన శ్రీ మారెమ్మ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు గావించారు. రాత్రి మొక్కుబడులు ఉన్న భక్తులు చాందినీబండ్లను ఆలయం చుట్టూ తిప్పారు. ఊరేగింపు సందర్భంగా చెక్కభజనలు, బ్యాండు మేళాలు, కోలాటాలు, బాణాసంచా పేలుళ్ల మధ్య కనుల పండువగా జాతర సాగింది. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని ఎస్ఐ రామకృష్ణ గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



జ్యోతిప్రజ్వలన చేసి బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న డీజీఎం, పాల్గొన్న బ్యాంకు సిబ్బంది

రాజంపేట టౌన్ : ఖాతాదారులకు మెరుగైన సేవలే పంజాబ్ నేషనల్ బ్యాంక్ లక్ష్యమని ఆ బ్యాంక్ లీడ్ డీజీఎం అభిజిత్ సిన్హా తెలిపారు. పట్టణంలోని దీప్ లాడ్జి సర్కిల్‌లో బుధవారం ఆయన పంజాబ్ నేషనల్ బ్యాంక్ రాజంపేట శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా లీడ్ డీజీఎం మాట్లాడుతూ పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ అన్నారు. తమ బ్యాంక్ బ్యాంక్ పేరును బట్టి ప్రజలు తమది ప్రైవేట్ బ్యాంక్ అనుకునే అవకాశముందని, అయితే తమ బ్యాంక్ పూర్తిస్థాయిలో ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ అని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ దేశంలోనే రెండవ పెద్ద బ్యాంక్ అని తెలిపారు. అన్ని ప్రాంతాల ప్రజలకు తమ బ్యాంక్ సేవలు అందించాలన్న లక్ష్యంతో రాజంపేటలోనూ బ్రాంచ్ ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన బ్రాంచ్ విజయవాడ సర్కిల్‌లో 73వ బ్రాంచ్ అని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఖాతాదారులకు టెక్నాలజీ సహాయంతో విశేష సేవలు అందిస్తున్నామన్నారు. తమ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ రంగాల వారి ఆర్థికాభివృద్ధికి, అలాగే అన్ని రకాల రుణాలను తమ బ్యాంక్ ద్వారా నిబంధనల మేరకు పొందవచ్చని తెలియజేశారు. డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీ ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సుబ్రమణ్యం, పట్టణ ప్రముఖులైన ఏబీ.రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకా తప్పనిసరిగా వేయించండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శరత్ కమల్

నందలూరు : బీసీజీ టీకా వేయించి టీబీ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ప్రభుత్వ వైద్యాధికారి శరత్ కమల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం వయోజనులకు, 18 సంవత్సరాల వయస్సు నుంచి 60 సంవత్సరాలు వయస్సులోపు వారికి, 5 సంవత్సరాల క్రిందట టీబీ వ్యాధి వచ్చి తగ్గిన వారికి, పొగ తాగుతూ చాలించిన వారికి, ఇప్పుడు పొగ తాగేవారికి, టీబీ వ్యాధిగ్రస్తులతో ఎక్కువ సంబంధాలు ఉన్నవారికి, బాడీ మాస్ ఇండెక్స్ 18 కంటే తక్కువ ఉన్న వారికి బీసీజీ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని గ్రామాల ప్రజలు బీసీజీ టీకా వేయించుకవాలని ఆయన సూచించారు. బీసీజీ టీకా వేసుకోవడం వలన ఎటువంటి హాని ఉండదని, ప్రతి సోమ, గురువారాలలో బీసీజీ టీకాలు గ్రామాలలో, ప్రతిరోజూ ప్రాథమిక కేంద్రంలో వేస్తారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, విశ్వనాథ్, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



హోమం చేస్తున్న అర్చకులు

మదనపల్లె సిటీ: స్థానిక వాసవీభవన్‌వీధిలోని శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం 11వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం గణపతిపూజ, స్వస్తివాచనం, నవగ్రహపూజ, కలశ స్థాపన, అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘ .అధ్యక్షులు ఓంప్రకాష్, ఉపాధ్యక్షులు గిరిధర్, కార్యదర్శి దేవతా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏడీఏగా శివశంకర్ బాధ్యతల స్వీకరణ



ఏడీఏగా బాధ్యతలు స్వీకరించిన శివశంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఓలు

మదనపల్లె : వ్యవసాయశాఖ మదనపల్లె డివిజన్ ఏడీఏగా శివశంకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏడీఏగా పనిచేస్తున్న దీక్షాకుమారి ఈనెలలో పదవీవిరమణ నేపథ్యంలో మాతృశాఖ సాయిల్ కన్సర్వేషన్‌కు వెళ్లేందుకు రిలీవ్ అయ్యారు. చిత్తూరులో పనిచేస్తున్న శివశంకర్‌ను మదనపల్లెకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఈనేపథ్యంలో బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ డివిజన్‌లో 40శాతం రాయితీతో 24,978 మంది రైతులకు 63,680 బస్తాలు(30కిలోలవి) పంపిణీ చేశామన్నారు. జనుము, జీలుగలను రాయితీతో అందజేశామని చెప్పారు.

నీట్ పరీక్షలో అవకతవకలపై న్యాయ విచారణ జరపాలి



కడప అప్సర సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నీట్ పరీక్షల్లో అక్రమాలపై న్యాయ విచారణ జరపాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం.ఓబులేసు యాదవ్ పేర్కొన్నారు. నగరం లోని అంబేద్కర్ సర్కిల్‌లో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ నీట్ యూజీ-2024 ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రావడం, దీనిలో ఏడుగురు హర్యానాకు చెందిన ఒకే ఎగ్జామ్ సెంటర్ వారు కావడం అనుమానాలకు దారి తీయడం వెనుక బీజేపీ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. హర్యానాలోని ఓ సెంటర్‌లో ఎగ్జామ్ రాసిన జాన్వి 179 ప్రశ్నలకు సమాధానం రాయగా, 163 కరెక్ట్ అయ్యాయి. ఆమెకు 636 మార్కులు రావాల్సి ఉన్నా.. 720/720 ఎలా వచ్చాయో తెలియదన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి న్యాయ విచారణ జరిపి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజ్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్లబాబు, పప్పుశెట్టి రెడ్డిసాయి, నాయకులు నవీన్, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారించాలి

కడప ఎడ్యుకేషన్: నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. కడప నగరంలోని అప్సర సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 విద్యా సంవత్సరంలో మెడికల్ విద్య అభ్యసించేందుకు జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షా ఫలితాలను హడావుడిగా విడుదల చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, నగర అధ్యక్షుడు హరిబాబు, ఆర్ఎస్‌యూ నాయకులు కుమార్, సందీప్, శ్యాసుందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.